శివాజీ పార్కుకు మహర్దశ

- రూ.1.5 కోట్లతో పార్కు ఆధునికీకరణ పనులు
- మరో రూ.50 లక్షలతో ఫౌంటెన్ సముదాయం అభివృద్ధి



శివాజీ పార్కు ముఖ ద్వారం

ఎంవీపీ కాలనీ: నగర ప్రజలను సేదదీర్చడంలో పార్కుల పాత్ర వెలకట్టలేనిది. రోజు వారి జీవితంలో బిజీబిజీగా గడిపే ప్రజలు సాయంత్రం పూట సేదతీర్చేవి ఈ పార్కులే. ఇలా నగర వాసులను సేదదీరుస్తున్న ప్రధానమైన పార్కుల్లో శివాజీ పార్కు ఒకటి. 16 ఎకరాల విస్తీర్ణంలో 1999లో రూ.8 లక్షల నిధులతో జీవీఎంసీ ఈ పార్కును నిర్మించింది. సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని పంచేందుకు జీవీఎంసీ పార్కుల విభాగం కృషి చేస్తోంది. ఇందు కోసం పార్కు ఆధునికీకరణ, సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టిపెట్టారు. రూ.2 కోట్ల వ్యయంతో ఆయా పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా పార్కు ముఖ ద్వారాన్ని, ఫౌంటెన్ సముదాయం, ఆడిటోరియంను పూర్తి స్థాయిలో ఆధునికీకరిస్తున్నారు. దీంతో పాటు పార్కులో ఛత్రపతి శివాజీమహారాజ్ విగ్రహాన్ని సైతం నెలకొల్పనున్నారు. ఈ పనులు పూర్తయితే శివాజీ పార్కు సందర్శకులకు మరింత కనువిందు చేయనుంది.


పార్కులో శరవేగంగా జరుగుతున్న పనులు

రూ.2 కోట్లతో ఆధునికీకరణ

ప్రస్తుతం శివాజీ పార్కులో ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత నెలలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్ పర్సన్ అక్కరమాని విజయనిర్మల ఈ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.1.5 కోట్లతో పార్కులో అభివృద్ధి పనులు చేపట్టారు. పార్కు ముఖద్వారం ఆధునికీకరణ, ఫ్లోరింగ్, సెంటర్ ప్లాజా ఫొటో షూట్ పాయింట్ అభివృద్ధి, టైల్స్ నిర్మాణం, పెయింటింగ్స్, లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు ప్రధాన మరుగుదొడ్లు, క్యాంటీన్ టాయిలెట్స్ రిపేర్, ప్లంబింగ్, పెయింటింగ్ పనులు నిర్వహిస్తున్నారు. వాకింగ్ ట్రాక్ గుంతలు లేకుండా మరమ్మతులు చేపడుతున్నారు. జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియాను ఆధునికీకరిస్తున్నారు. దీంతో పాటు మరో రూ.50 లక్షలతో ఫౌంటెన్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.


నడక మార్గంలో పనులు చేస్తున్న సిబ్బంది

అక్టోబర్ నాటికి అందుబాటులోకి..

జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు పార్కు ఆధునికీకరణపై దృష్టి పెట్టాం. ప్రస్తుతం సందర్శకుల అవసరాలకు అనుగుణంగా ఆధునిక హంగులతో సౌకర్యాలు కల్పిస్తున్నాం. పిల్లల ప్లే ఏరియాను, ఫొటో షూటింగ్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఫౌంటెన్ల సముదాయంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నాం. అక్టోబర్ చివరి నాటికి పనులు పూర్తిచేసి నగరవాసులకు అందుబాటులోకి తెస్తాం.

– సురేష్, జీవీఎంసీ ఏఈ(పార్క్స్)

క్లుప్తంగా

రేపు అందుబాటులో సబ్సిడీ టమాటా

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో ఈ నెల 5న సబ్సిడీ టమాటా అందుబాటులో ఉంటుందని ఈవో జి.ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులుగా సబ్సిడీ టమాటాలు రైతుబజార్లలో అందుబాటులో లేని విషయం తెలిసిందే. శనివారం టమాటా అందుబాటులోకి వస్తుందని, ఎంవీపీ రైతుబజార్‌లో ఎప్పటిలాగే కౌంటర్లలో రూ.50కి కిలో చొప్పున విక్రయాలు జరుగుతాయని ఈవో తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

10న బీజేపీ ఆధ్వర్యంలో ధర్నాలు

ఎంవీపీ కాలనీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పిలుపు మేరకు ఈ నెల 10న ధర్నాలు నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్సీ మాధవ్, పార్టీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తెలిపారు. ఈ మేరకు గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ కోర్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సర్పంచులకు ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించడాన్ని నిరసిస్తూ ఈ ధర్నాలు చేపట్టనున్నామన్నారు. రాష్ట్రంలో రూ.453 కోట్లతో అభివృద్ధి చేయనున్న 18 రైల్వేస్టేషన్లకు ఈ నెల 6న ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారన్నారు.

అదనపు అంతస్తు కూల్చివేత


నిర్మాణాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

ఏయూ క్యాంపస్: అనుమతి లేకుండా నిర్మించిన అదనపు అంతస్తును జీవీఎంసీ అధికారులు కూల్చివేశారు. స్థానిక 20వ వార్డు పెదవాల్తేరు రోడ్డులో అనధికారికంగా నిర్మిస్తున్న అదనపు అంతస్తును జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం తొలగించారు. జీవీఎంసీ నుంచి అనుమతులు లేకుండా నిర్మించడంతో ఈ అదనపు అంతస్తును తొలగించామన్నారు.

కృష్ణా జూనియర్ కళాశాలలో ఎన్‌సీసీ ప్రవేశాలు


ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ సుజాత

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎన్‌సీసీలో ప్రవేశాలు కల్పిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. గురువారం లెఫ్ట్‌నెంట్ బి.సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికలో జూనియర్ కళాశాల విద్యార్థులు 350 మంది హాజరయ్యారు. 24 ఖాళీలకు 16 మంది బాలురు, 8 మంది బాలికలను ఎంపిక చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగమణి, అధ్యాపకులు ఆర్.పి.నాయుడు, విమల పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


నుజ్జయిన బైక్ ముందు భాగం

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో గురువారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. సింహాచలం నుంచి హనుమంతవాక వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడిని రామకృష్ణాపురం దరి డంపింగ్ యార్డు కూడలి వద్ద చెత్త తరలించే జీవీఎంసీ వ్యాన్ ఢీకొంది. హనుమంతవాక వైపు నుంచి వస్తున్న ఈ వ్యాను ఇక్కడ కూడలిలో డంపింగ్ యార్డ్‌కు మలుపు తిరుగుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. యువకుడికి కుడి కాలు విరిగిపోయింది. బైక్ ముందు భాగం నుజ్జయింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐ కుమార్ సిబ్బందితో వెళ్లి క్షతగాత్రుడిని హెల్త్‌సిటీలో ఓ ఆస్పత్రికి తరలించారు. ఆరిలోవ లా అండ్ ఆర్డర్ పోలీసులు దీనిపై కేసు నమోదు చేశారు.

పరిశ్రమగా క్యాటరింగ్ రంగానికి గుర్తింపు అవసరం

మద్దిలపాలెం : క్యాటరింగ్ రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమగా గుర్తించి ఆదుకోవాల్సిన అవసరం ఉందని క్యాటరింగ్ అసోసియేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వరదరాజులు అన్నారు. మద్దిలపాలెంలోని ఓ హోటల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజనకు ముందు అసోసియేషన్ హైదరాబాద్‌లో ఉండేదని, తర్వాత 2016లో విజయవాడ కేంద్రంగా ఏపీ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల్లో 13 జిల్లాలను మూడు జోన్‌లుగా విభజించామన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం నార్త్ జోన్‌గా ఒక అసోసియేషన్ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో 1300 మందికి పైగా క్యాటరింగ్ రంగంలో ఉన్నారన్నారు. అలాగే బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని కోరారు.

స్కాలర్‌షిప్‌ల పంపిణీకి ఆమోదం

క్యాటరింగ్ అసోసియేషన్‌లో సభ్యుల పిల్లల చదువుకు రూ.10లక్షలు స్కాలర్‌షిప్‌లుగా ఇవ్వడానికి అసోసియేషన్ నిర్ణయం తీసుకుందని వరదరాజులు తెలిపారు. ఈ ఏడాది నుంచి స్కాలర్‌షిప్‌లు ఇవ్వనున్నామన్నారు. టెన్త్, ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు రూ.10వేలు మెరిట్ స్కాలర్‌షిప్ అందజేయనున్నామన్నారు. సభ్యులకు గ్రూప్ ఇన్సూరెన్స్, వైద్య శిబిరాలు నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎలమంచలి బాలగంగాధర్ శివాజీ, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న క్యాటరింగ్ అసోసియేషన్ ఫెడరేషన్ అధ్యక్షుడు వరదరాజులు

బాలికా విద్యతోనే అభివృద్ధి

విశాఖ లీగల్ : బాలికా విద్యతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని విశాఖ జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ అన్నారు. గురువారం ఆమె పాతపోస్టాఫీసు వద్ద ఉన్న క్వీన్‌మేరీ హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలో వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. సంపదను దోచుకెళ్లొచ్చు కానీ చదువును ఎవరూ దోచుకెళ్లలేరని చెప్పారు. సమాజ ఉన్నతికి చదువు దోహదపడుతుందని చెప్పారు. డబ్బు ఎంత వాడితే అంత ఖర్చవుతుందని, ఎంత చదివితే అంత విజ్ఞానం పెంపొందుతుందని తెలిపారు. బాలికలకు చదువుతోపాటు ఆటలు, వ్యాయామం వంటి అంశాల్లోనూ అవగాహన కల్పించాలన్నారు.


మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ

సాధారణ ప్రయాణికుల పాట్లు

తాటిచెట్లపాలెం: రైళ్లలో ప్రయాణించే సాధారణ ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రైల్లో నిల్చోలేరు..కూర్చోలేరు. కనీసం మరుగుదొడ్లకు, మూత్రవిసర్జనకు కూడా వీలులేని పరిస్థితి. గురువారం భాగల్‌పూర్ నుంచి బెంగళూరు వెళ్తున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ గురువారం మధ్యాహ్నం విశాఖ చేరుకుంది. అంతే అప్పటివరకు ఎంతో ఓపిగ్గా ఎదురు చూసిన సాధారణ ప్రయాణికులు ఒకరివెంట ఒకరు రైలు దిగి ట్రాక్‌ల వెంబడి మూత్రవిసర్జన కోసం పరుగులు తీశారు. ట్రాక్‌లపై మూత్రవిసర్జన చేయడం ప్రమాదం, నేరం అని తెలిసి కూడా వేరే దారి లేక బోగీల్లో బాత్రూంలోకి ప్రవేశించడానికి అవకాశం లేక ఇలా చేయడం రైల్వే అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించినట్టు అయింది.

అక్టోబర్ 8న వైజాగ్ జూ మారథాన్

దాబాగార్డెన్స్ : వైజాగ్ ట్రైల్ రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 8న వైజాగ్ జూ మారథాన్ నిర్వహించనున్నట్టు కార్యక్రమ నిర్వాహకులు కీర్తి మహాజన్, కృష్ణ చైతన్య తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలోని ఓ హోటల్లో మారథాన్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరాగాంధీ జులాజికల్ పార్క్ నుంచి ఈ మారథాన్ ఉంటుందని, ఇందులో 4 రకాలున్నాయన్నారు. 21కే, 10కే, 5కే, 3కే పేరిట ఈ పోటీలు ఉంటాయన్నారు. మారథాన్‌లో పాల్గొనే క్రీడాకారులు, నగర ప్రజలు, ఆసక్తి గల వారంతా ముందుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వీటీఆర్ఏ.రన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

యోగా, ఆయుర్వేదం.. ఆరోగ్యదాయకం


ఏయూ క్యాంపస్: యోగా సాధన, ఆయుర్వేద వైద్య విధానాలు మానవుని ఆరోగ్యవంతునిగా తీర్చిదిద్దుతాయని కేజీహెచ్ ఆయుష్ క్లీనిక్ విశ్రాంత వైద్యాధికారి కె.ఈశ్వరరావు అన్నారు. గురువారం ఏయూ యోగా విలేజ్‌లో జరిగిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. జీర్ణక్రియ, చర్మ వ్యాధులకు సంబంధించిన రోగులకు తగిన చికిత్స విధానాలు, ఔషధాలు వివరించారు. భోజనానికి సమయపాలన అవసరమని, మనం తిన్న ఆహారం జీర్ణం కాకుండా మళ్లీ ఆహారం తీసుకోవడం సరికాదని సూచించారు. నిల్వ ఆహారం, రెండో సారి వేడిచేసిన ఆహారం తీసుకోవడం వల్ల వచ్చే వ్యాధులను తెలియజేశారు. మంచినీరు తగినంత తీసుకోవడం, యోగా చేయడం, నడక చెమటపట్టే విధంగా వ్యాయామం చేయడం ఎంతో అవసరమని సూచించారు. ముఖ్యంగా చిన్నారులను జంక్ ఫుడ్‌కి దూరంగా ఉంచాలన్నారు. ప్రతి నెల 3న యోగా విలేజ్‌లో ఉచిత ఆయుర్వేద శిబిరం నిర్వహిస్తామన్నారు.


22వ వార్డులో ముమ్మరంగా ఫాగింగ్


పిఠాపురం కాలనీలో ఫాగింగ్ చేస్తున్న మలేరియా సిబ్బంది

మద్దిలపాలెం : డెంగ్యూ, మలేరియా కట్టడికి చేపడుతున్న చర్యల్లో భాగంగా 22వ వార్డులో జీవీఎంసీ మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఫాగింగ్ ప్రక్రియ చేపట్టారు. జీవీఎంసీ మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రత్యేకంగా పిఠాపురం కాలనీలో గురువారం మెగా ఫాగింగ్ నిర్వహించారు. దోమల వ్యాప్తిని తగ్గించడానికి సాయంత్రం వేళలలో ఈ ఫాగింగ్ ఉపయోగపడుతుందని జిల్లా మలేరియా సబ్‌యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ తెలిపారు. ప్రతి ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలె లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విభాగం సూపర్‌వైజర్లు మహన్‌దాదా, బి.కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అనధికారిక బడ్డీలపై కన్నెర్ర


గురువారం వరకు వివేకానందనగర్ పార్కు ముందు ఉన్న బడ్డీలు


బడ్డీలు తొలగించిన అనంతరం విశాలంగా కనిపిస్తున్న పార్కు ముందు భాగం

ఆరిలోవ: రోడ్డును ఆక్రమించి అనధికారికంగా ఏర్పాటు చేసిన బడ్డీలపై టౌన్ ప్లానింగ్ అధికారులు కన్నెర్ర చేశారు. ఇందులో భాగంగా రోడ్డుపై ఏర్పాటు చేసిన బడ్డీలను తొలగిస్తున్నారు. జీవీఎంసీ 10వ వార్డు వివేకానందనగర్ పార్కు ముందున్న బడ్డీలను జోన్-2 ఏసీపీ వెంకటేశ్వరరావు ఆదేశాలతో స్క్వాడ్ సిబ్బంది గురువారం తొలగించారు. ఇక్కడ పార్కుతో పాటు డాక్టర్ వైఎస్సార్ యూపీహెచ్‌సీ కూడా ఉంది. వీటి ముందు అనధికారికంగా బడ్డీలు, చేపలు విక్రయించే బల్లలు, టీ దుకాణాలు ఏర్పాటు చేశారు. వాటన్నింటిని తొలగించారు. ఆ సమయంలో బడ్డీల నిర్వాహకులు జీవీఎంసీ స్క్వాడ్ సిబ్బందిని అడ్డుకున్నారు. వీటిని ఎందుకు తొలగిస్తున్నారంటూ నిలదీశారు. రోడ్డు మీద బడ్డీల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని అందుకే తొలగిస్తున్నట్టు సిబ్బంది స్పష్టం చేశారు. దీనిపై కొద్దిసేపు సిబ్బందితో బడ్డీల నిర్వాహకులు వాగ్వాదం చేశారు. అయినా సిబ్బంది బడ్డీలన్నింటినీ తొలగించి పార్కు ముందు శుభ్రం చేశారు.

మరి వాటి పరిస్థితేమిటి?

డెయిరీ ఫారం కూడలి నుంచి రవీంద్రనగర్ వరకు రోడ్డు పక్కన అనధికారికంగా పదుల సంఖ్యలో ఇటీవల ఏర్పాటు చేసిన బడ్డీలు ఉన్నాయని, వాటిని పట్టించుకోకుండా ఇక్కడ బడ్డీలను మాత్రమే తొలగించడంపై టౌన్ ప్లానింగ్ అధికారులపై స్థానికులు విమర్శలు చేస్తున్నారు. తోటగరువు హైస్కూల్ రోడ్డు, ఎస్ఐజీ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ముందు, ఆదర్శనగర్‌లో కృష్ణాగ్రామర్ స్కూల్ ఎదురుగా ప్రధాన రహదారి పైన, డెయిరీఫారం వద్ద పశు సంవర్ధక శాఖ కార్యాలయం ఎదుట సుమారు 30కి పైగా బడ్డీలు ఇటీవల అనధికారికంగా ఏర్పాటు చేశారు. వీటితో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై యథేచ్ఛగా ఏర్పాటు చేసిన బడ్డీలను తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

బీచ్ రోడ్డు: మిలటరీ ఇంజినీరింగ్ సర్వీస్ డిఫెన్స్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని బిల్డర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు చెరువు రామకోటయ్య, చైర్మన్ వెంకటేశ్వర్లు కోరారు. నూతనంగా మిలటరీ ఇంజినీరింగ్ సర్వీస్ జాతీయ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన బాలసతీష్‌ను గురువారం బిల్డర్ అసోసియేషన్ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా డిఫెన్స్‌లో పలు సమస్యలను బాలసతీష్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఏఐ కార్యదర్శి మూర్తి, ఎ.కాశీవిశ్వేశ్వరరావు, జీవీ రవిరాజు, తదితరులు పాల్గొన్నారు.


బాలసతీష్‌ను సత్కరిస్తున్న బీఏఐ సభ్యులు

ఏయూ సమాచారం..

'కరికులం ఫర్ విజువల్లీ చాలెంజ్డ్'పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు, డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్ ప్రకాశరావు సంయుక్తంగా రచించిన 'కరికులం ఫర్ విజువల్లీ చాలెంజ్డ్'పుస్తకాన్ని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయితలను వీసీ అభినందించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉపయుక్తంగా పాఠ్యప్రణాళిక రచన చేయడం మంచి పరిణామమన్నారు. పుస్తక రచయిత డాక్టర్ టి.షారోన్‌రాజు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల విద్యార్థులకు విద్యను అందించడం, వారు స్వశక్తిగా ఎదిగే విధంగా తీర్చిదిద్దడం ఎంతో అవసరమన్నారు. బ్రెయిలీ ఉపకరణాలు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల ప్రాధాన్యత, ఆవశ్యకత, స్వీయ నైపుణ్యాలు పెంపొందించడం తదితర అంశాలను పుస్తకంలో వివరించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, డాక్టర్ ప్రవీణదేవి పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం, మూర్తిమత్వ వికాసంపై వర్క్‌షాప్


విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగంలో విద్యార్థులకు, పరిశోధకులకు ఉపయుక్తంగా వృత్తి నైపుణ్యాలు, మూర్తిమత్వ వికాసంపై మూడు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంతో మమేకపై విద్యార్థులు పని చేయాలన్నారు. సమాజాభివృద్ధికి దోహదపడే కోర్సుల్లో సోషల్‌వర్క్ ఒకటన్నారు. సమాజ సమస్యలకు అర్థవంతమైన పరిష్కారాలు చూపాలన్నారు. దీనికి భావ ప్రసార, వృత్తి, బృంద నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు కలిగి ఉండటం ఎంతో అవసరమన్నారు. విభాగ పూర్వ విద్యార్థి, టాటా గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ సలహాదారు డాక్టర్ జె.ప్రసాద్ మాట్లాడుతూ విభిన్న సంస్థల్లో పనిచేసే సమయంలో శాఖలు, వ్యక్తులను సమన్వయం చేస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించే అంశాలను వివరించారు. విశ్రాంత ఆర్‌జేడీ రాములు, ఏయూ దూర విద్య కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు, ఆచార్య పి.అర్జున్, సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎస్.హరనాథ్, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ తదితరులు ప్రసంగించారు. మూడు రోజుల వర్క్‌షాప్‌లో విద్యార్థులు విభిన్న నైపుణ్యాలపై అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ అబ్రహం, డాక్టర్ పుష్పలత, డాక్టర్ ఆశాకిరణ్ సమన్వయం చేశారు.

సాధనతోనే లక్ష్యం సాకారం


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: నిత్యం క్రమపద్ధతిలో సాధన చేస్తే లక్ష్యం సాకారం అవుతుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. గురువారం ఏయూ అలుమ్ని సమావేశ మందిరంలో ప్లేస్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు, అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ ఆంగ్ల భాషపై పట్టు సాధించాలంటే ఆరు నెలల కాలం కష్టపడాలని సూచించారు. ఇతరులతో పోల్చుకోవడం మానివేయాలని, మన సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి ఆలోచన చేయాలన్నారు. అనంతరం అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య అవకాశాలు, ప్రవేశాలు విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి వి.ఆర్.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఐపీఆర్‌పై ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు


కోర్సు పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డీపీఐఐటీ-ఐపీఆర్ చైర్ ఆధ్వర్యంలో ఐపీఆర్‌పై వారం రోజుల ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో కోర్సు వివరాలతో కూడిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకు అండర్ స్టాండింగ్ పేటెంటింగ్ సిస్టమ్స్ ఇన్ ఇండియా అంశంపై వారం రోజుల ఆన్‌లైన్ కోర్సు నిర్వహిస్తామన్నారు. శిక్షణ కార్యక్రమం సమన్వయకర్త డాక్టర్ హనుమంతు పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, స్టార్టప్ సంస్థల నిర్వాహకులకు ఈ కోర్సు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు పూర్తి వివరాలను ఏయూ వెబ్‌సైట్‌తో పాటు 95992 29217 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డీపీఐఐటీ-ఐపీఆర్ చైర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం, ఐపీఆర్ అటార్నీ యు.అశోక్ హేమంత్, సీపీఆర్ డాక్టర్ డి.హరిత, తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రనవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో పూజా రుసుము చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


అప్పన్న ఉత్సవమూర్తులకు స్వర్ణపుష్పార్చన చేస్తున్న అర్చకుడుప్రదక్షిణ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జితసేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. ఉభయ దాతలను స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేణపూజ, పుణ్యావాచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళిపూజ నిర్వహిస్తూ 108 స్వర్ణపుష్పాలతో అర్చన చేశారు.

నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజింపజేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు.